క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: విద్యుత్ లైన్ల నిర్వహణలో భాగంగా ఈనెల 23న హనుమకొండ, వరంగల్‌లోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని టీఎస్ ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ సాంబరెడ్డి, వరంగల్ టౌన్‌డీఈ ఎస్.మల్లికార్జున్ తెలిపారు. హనుమకొండలోని బాలసముద్రం ప్రాంతంలో ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు వివరించారు. వరంగల్‌లోని కృష్ణాకాలనీ, స్టేషన్‌రోడ్, వరంగల్ చౌరస్తా, రాంకీ, గ్రెయిన్ మార్కెట్, దయానంద కాలనీ, లక్ష్మీపురం, రంగశాయిపేట, మహాలక్ష్మి దేవాలయం, గొల్లవాడ, కుమ్మరివాడ, నాయుడు పెట్రోల్ పంపు, గణపతి ఇంజనీరింగ్ కళాశాల, పెరకవాడ, ఎస్ఆర్ఆర్ తోట, బీరన్నకుంట, మామునూరు, కుమ్మరిపల్లి, వెటర్నరీ కళాశాల, రంగంపేట, బట్టలబజార్, ఓఎస్‌నగర్, పాపయ్యపేట చమన్, దేశాయిపేట, బాలాజీనగర్, నజరత్‌పుర, కొత్తవాడ, డాక్టర్స్ కాలనీ, బ్యాంక్ కాలనీ, మర్రి వెంకటయ్య కాలనీ, రాంనాథ్‌పురై, ఫిల్టర్‌బెడ్ ప్రాంతాల్లో ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ కోత విధించనున్నట్లు వారు వేర్వేరు ప్రకటనలో వివరించారు.

శంకర్‌కు డాక్టరేట్



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని ఇంగ్లిష్ విభాగం పరిశోధకుడు దేవసోత్ శంకర్‌కు యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది. అమితావ్ ఘోష్ సెలెక్ట్ ఫిక్షన్ : ఏ స్టడీ ఇన్ హిస్టారికల్ పర్స్పెక్టివ్ అనే అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి దేవసోత్ శంకర్‌కు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ మల్లారెడ్డి తెలిపారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ మేఘనరావు పర్యవేక్షణలో శంకర్ తన పీహెచ్‌డీ పూర్తిచేశారు.

వేతనాల పెంపునకు కృషి చేయాలి

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో దినసరి వేతనం, లంప్సమ్, క్యాజువల్ ఉద్యోగులకు వేతనాల పెంపునకు సంబంధించిన జీఓ 60 అమలయ్యేలా కృషి చేయాలని కాకతీయ యూనివర్సిటీ దినసరి వేతన, తాత్కాలిక ఉద్యోగుల సంఘాల బాధ్యులు కోరారు. ఈమేరకు వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డిని సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. అలాగే, కేయూ వీసీ ప్రొఫెసర్ తాటికొండ రమేష్‌ను కూడా కలిసి పెంచిన వేతనాలు అమలయ్యేలా చూడాలని సూచించారు. ఉద్యోగ సంఘాల బాధ్యులు దయాకర్, శివప్రసాద్, సంగాల రాజమౌళి, సురేష్, డాక్టర్ శాగంటి శ్రీనివాస్, సంతోష్, గోపి, సుధాకర్, కుమార్ పాల్గొన్నారు.

కేయూకు నిధులు కేటాయించాలి

కేయూ క్యాంపస్: ప్రభుత్వ వార్షిక రాష్ట్ర బడ్జెట్‌లో కాకతీయ యూనివర్సిటీకి నిధులు పెంచి బడ్జెట్‌లో కేటాయింపులు ఉండేలా కృషి చేయాలని ప్రజావేదిక రాష్ట్ర చైర్మన్, అధ్యాపకుడు డాక్టర్ తిరుణహరి శేషు, బాధ్యులు కోరారు. ఈమేరకు పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డిని సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ కుమారస్వామి, డాక్టర్ రమేష్, డాక్టర్ రాంబాబు, డాక్టర్ నరేందర్ తదితరులు పాల్గొన్నారు.


పాఠశాలకు పంపించాలి

వరంగల్: తల్లిదండ్రులు తమ పిల్లలను క్రమం తప్పకుండా పాఠశాలకు పంపించాలని వరంగల్ ఏంఈఓ విజయ్‌కుమార్ సూచించారు. ఔట్ ఆఫ్ స్కూల్ చిల్డ్రన్ కార్యక్రమంలో భాగంగా చిన్నచిన్న కారణాలతో పాఠశాలకు వెళ్లకుండా ఇంట్లో ఉంటున్న ఓ విద్యార్థిని ఏంఈఓ గుర్తించి జీహెచ్ఎస్ గిర్మాజీపేట స్కూల్‌లో సోమవారం చేర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడీడు పిల్లలందరు బడికి పోవాలని సూచించారు. హెచ్ఎం నాగమణి, సువర్చల, రమేష్, బుచ్చిరెడ్డి, సంపత్, శకుంతలాదేవి పాల్గొన్నారు.

ఎన్పీడీసీఎల్ సీఎండీని కలిసిన టీఎస్ఈఈయూ నేతలు

హన్మకొండ: టీఎస్ ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్‌రెడ్డిని తెలంగాణ స్టేట్ ఎలక్ట్రిక్ ఎంప్లాయిస్ యూనియన్ (టీఎస్ఈఈయూ) -327 నాయకులు కలిశారు. హనుమకొండ నక్కలగుట్టలోని ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయంలో వరుణ్‌రెడ్డిని రాష్ట్ర సెక్రటరీ జనరల్ ఇనుగాల శ్రీధర్, నాయకులు సోమవారం కలిసి 2024 డైరీ, క్యాలెండర్‌ను అందించారు. కార్యక్రమంలో ఎన్పీడీసీఎల్ శాఖ అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, సెక్రటరీ శ్రీనివాస్, నాయకులు తులసి శ్రీమతి, సదయ్య, ఓదెలు, ఎం.బుచ్చయ్యగౌడ్, బాబు, ఎం.సోమయ్య, జశ్వంత్ పాల్గొన్నారు.

ఒలింపియడ్‌లో విద్యార్థుల ప్రతిభ



ఖిలా వరంగల్: కాట్ (నాలెడ్జ్ అసెస్‌మెంట్ టెస్ట్) ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన ఒలింపియడ్ పరీక్షల్లో శంభునిపేట రెనాల్డ్స్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారని ప్రిన్సిపాల్ శ్రీధర్ తెలిపారు. ఈమేరకు వారిని సోమవారం అభినందించారు. కార్యక్రమంలో చైర్మన్ శ్రీధర్, డైరెక్టర్ శ్రీవిద్య, ఏజీఎం రాజేశ్వర్‌రెడ్డి, మహేష్, శ్రీహరి, శ్రీధర్, డీన్ వెంకటేష్, సతీష్, రాజు, గణేష్ పాల్గొన్నారు.

వేయిస్తంభాల దేవాలయంలో పూజలు చేస్తున్న అర్చకులు



కాజీపేటలో సీపీ అంబర్ కిశోర్‌ఝాను సన్మానిస్తున్న ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు



ర్యాలీలో ఇరు జిల్లాల బార్ అసోసియేషన్ ప్రతినిధులు



వైభవంగా బాలరాముడి ప్రాణప్రతిష్ఠ

అయోధ్యలో బాలరాముడి ప్రాణప్రతిష్ఠ సందర్భంగా నగరంలో ఆధ్యాత్మిక వేడుకలను సోమవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాలయాల్లో అర్చకులు, భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. రాముడి శోభాయాత్రను కనులపండువగా నిర్వహించి అన్నదానాలు చేశారు.

– సాక్షి నెట్‌వర్క్



ఓసిటీ రోడ్డులోని సీతారాముల ఆలయంలో..



ఫోర్ట్‌రోడ్డు వై ఆకారం జంక్షన్‌లో..



మడికొండ: శోభాయాత్రను నిర్వహిస్తున్న భక్తులు



చింతల్ బస్తీలో వేడుకను తిలకిస్తున్న భక్తులు



కాజీపేట రైల్వే ఆలయ సముదాయంలో..



మల్లికాంబ మనోవికాస కేంద్రంలో..



హసన్‌పర్తి: చికెన్ షాపులు బంద్ చేసిన నిర్వాహకులు



గోవిందరాజుల గుట్ట వద్ద శ్రీరామ శోభాయాత్ర



కరసేవలను సన్మానిస్తున్న శివశక్తి స్థల్ ఆలయ కమిటీ బాధ్యులు



31వ డివిజన్ దుర్గాదేవి కాలనీలో..



ఏనుమాముల హనుమాన్ దేవాలయంలో..

డైరెక్టర్ త్రివిక్రమ్‌పై చర్య తీసుకోవాలి



వరంగల్ చౌరస్తా: ప్రపంచ మేధావులైన కారల్ మార్క్స్, లెనిన్ పేర్లను ఇటీవల విడుదలైన గుంటూరు కారం సినిమాలోని విలన్లకు పేర్లు పెట్టడాన్ని ప్రజా సంఘాలు తీవ్రంగా తప్పుపట్టాయి. ఈమేరకు వరంగల్ ఎస్2 థియేటర్ ఎదుట ఐద్వా, ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ నాయకులు నిరసన తెలిపి, డైరెక్టర్ తివిక్రమ్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా కార్యదర్శి నలగంటి రత్నమాల, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు చుక్క ప్రశాంత్, డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు బొక్క చరణ్ మాట్లాడారు. ఆ సినిమా డైరెక్టర్ త్రివిక్రమ్.. సమాజానికి బహిరంగ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. కాంపల్లి అనిత, ప్రతిభ, రజియా, సుల్తానా, షమీనా, పర్వాహన, మహేష్, యశ్వంత్, జగన్, ఉమేష్, వలి, యాకుబ్ పాషా, కుమార్, ప్రభు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుపై ఫిర్యాదును వెనక్కి తీసుకోవాలి

నయీంనగర్: వివిధ మార్గాల ద్వారా వచ్చిన సమాచారాన్ని వార్తలుగా మలిచే జర్నలిస్టులను ప్రజాప్రతినిధులు బెదిరింపులకు గురిచేయటం తగదని గ్రేటర్ వరంగల్ ప్రెస్‌క్లబ్ బాధ్యులు హితవు పలికారు. సీనియర్ జర్నలిస్ట్ గడ్డం కేశవమూర్తిపై గ్రేటర్ వరంగల్ మేయర్ గుండు సుధారాణి పెట్టిన అక్రమ కేసును వెంటనే వెనక్కి తీసుకోవాలని క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు, ప్రధాన కార్యదర్శి బొల్లారపు సదయ్య, కోశాధికారి బోళ్ల అమర్ డిమాండ్ చేశారు.

దర్గా ఉర్సుకు ఏర్పాట్లు చేయాలి

కరీమాబాద్: ఉర్సు దర్గాలో ఫిబ్రవరి 2, 3, 4వ తేదీల్లో జరగనున్న హజ్రత్ మాషుక్ రబ్బానీ 462వ దర్గా ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ఆదేశించారు. ఉర్సు కరీమాబాద్‌లోని దర్గాను సోమవారం మంత్రి సందర్శించి మాట్లాడారు. మసీదు పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలని, మరుగుదొడ్ల ఏర్పాటు, శానిటేషన్ నిర్వహణ, తాగునీటి సౌకర్యం, వైద్య శిబిరం ఏర్పాటు చేయాలని సూచించారు. దర్గా పీఠాధిపతులు ఉబెద్‌బాబా, నవీద్‌బాబా, ఏసీపీ బోనాల కిషన్, మగ్దూం మొహినొద్దీన్, బల్దియా అధికారులు పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మంత్రి, తదితరులు

కుక్కల నియంత్రణకు ప్రత్యేక కార్యాచరణ

రామన్నపేట: నగరంలోని 21వ డివిజన్‌లో ఎల్బీనగర్‌లో చిన్నారులపై ఆదివారం కుక్కల దాడి ఘటన కలిచివేసిందని దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ఆవేదన వ్యక్తం చేశారు. కుక్కలు, కోతుల నియంత్రణకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టనున్నట్లు తెలిపారు. గార్డియన్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధిత చిన్నారిని మంత్రి సోమవారం పరామర్శించి మెరుగైన వైద్యం అందించాలని ఆస్పత్రి వైద్యుడు డాక్టర్ కాళీ ప్రసాద్‌కు సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ షేక్‌రిజ్వానా బాషా, సీఎంహెచ్ఓ డాక్టర్ రాజేష్, ఆస్పత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాద బాధితుడికి ఆర్థికసాయం



మామునూరు: ఖిలా వరంగల్ మండలం మామునూరు టీఎస్ఎస్పీ 5వ బెటాలియన్‌లో కాంట్రాక్ట్ ఉద్యోగిగా పనిచేస్తున్న వేల్పుల నాగరాజు కుమారుడు వేల్పుల లక్ష్మణ్ ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. అతని మెదడుకు ఆపరేషన్ కోసం 5వ బెటాలియన్ స్పెషల్ కానిస్టేబుళ్లు రూ.1.20లక్షలు, కమాండెంట్ డీఎస్పీ రెడ్డి రూ.25వేల ఆర్థిక సాయాన్ని కమాండెంట్ శివప్రసాద్‌రెడ్డి చేతుల మీదుగా సోమవారం అందజేశారు. కార్యక్రమంలో డీఎస్పీ రెడ్డి, ఏసీ శ్రీనివాస్‌రావు, సోమని, ఆర్ఐలు, కార్తీక్, శోభన్ బాబు, అన్నయ్య, ఆర్ఎస్సైలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

హన్మకొండ అర్బన్: ఎన్నికల సమయంలో రైతులకు ఇచ్చిన హామీలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని ఆల్ ఇండియా కిసాన్ ఫెడరేషన్ (ఏఐకేఎఫ్) జిల్లా కార్యదర్శి హంసారెడ్డి డిమాండ్ చేశారు. సంఘం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు హనుమకొండ తహసీల్దార్ విజయ్‌కుమార్‌కు సోమవారం వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ, రైతు భరోసా కింద ఎకరాకు రూ.15 వేల ఆర్థికసాయం, వరి పంటకు రూ.500 బోనస్, పంటలకు గిట్టుబాటు ధర, వ్యవసాయ కార్మికులకు రూ.12 వేల ఆర్థికసాయం, కౌలు రైతులకు గుర్తింపు కార్డులు అందించనున్నట్లు కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిందని గుర్తుచేశారు. కార్యక్రమంలో అఖిల భారత ప్రజాతంత్ర విద్యార్థి సమాఖ్య ప్రధాన కార్యదర్శి గడ్డం నాగార్జున, అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సమైక్య జిల్లా కార్యదర్శి సావిత్రి, జిల్లా కమిటీ సభ్యులు ఉస్మాన్, అస్రఫ్, రాజక్క, సుధాకర్, రవి పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నియోజకవర్గ ప్రజల రుణం తీర్చుకుంటా



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న స్థానికులు

కాజీపేట: వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యేగా తాను గెలిచేలా సహకరించిన ప్రజలకు అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందేలా చేయూతనందించి, వారి రుణం తీర్చుకుంటానని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. కాజీపేట 62వ డివిజన్ సత్యసాయి గార్డెన్స్‌లో పట్టణ గంగపుత్ర సంఘం సభ్యుల ఆధ్వర్యంలో సోమవారం ఏర్పాటు చేసిన ఆత్మీయ సన్మాన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను గంగపుత్ర సంఘం సభ్యులు సన్మానించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు జక్కుల రవీందర్ యాదవ్, విజయశ్రీ రజాలీ, పాక శ్రీనివాస్, వెంపటి సురేష్, పాక భాస్కర్, రవికుమార్, శంకర్, చందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

సుందరీకరణకు నిధుల మంజూరు

వడ్డేపల్లి ట్యాంక్‌బండ్ సుందరీకరణ పనులను పూర్తి చేయడానికి కావాల్సిన నిధులను మంజూరు చేయిస్తానని ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డి అన్నారు. అధికారులతో కలిసి కాజీపేట 61వ డివిజన్ వడ్డేపల్లి ట్యాంక్ బండ్‌ను సోమవారం సందర్శించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు తోట వెంకటేశ్వర్లు, జక్కుల రవీందర్ యాదవ్, విజయశ్రీ రజాలీ, డివిజన్ అధ్యక్షుడు రమేష్, కాంగ్రెస్ నాయకులు సాగరిక, రమాకాంత్ రెడ్డి, అంకూస్ తదితరులు పాల్గొన్నారు.

వడ్డేపల్లి అభివృద్ధికి కృషి

హన్మకొండ అర్బన్: వడ్డేపల్లి ప్రాంత అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి అన్నారు. వడ్డేపల్లిలో పర్యటించి స్థానిక శ్మశాన వాటికను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా తమ సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యేను కోరుతూ స్థానికులు వినతిపత్రం అందజేశారు.

విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ



కాజీపేట అర్బన్: 31వ డివిజన్‌లోని న్యూశాయంపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు లయన్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ -320ఎఫ్ ఆధ్వర్యంలో సోమవారం నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ దేవమణి, లయన్స్ క్లబ్ సభ్యులు చంద్రశేఖర్, ప్రభాకర్, సుభాష్, రాజేశ్వరి, నిర్మల తదితరులు పాల్గొన్నారు.

వాకర్స్ సంఘం ఎన్నిక

హన్మకొండ చౌరస్తా: 4వ డివిజన్ పరిధిలోని కెనాల్ కట్ట వాకర్స్ అసోసియేషన్ కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ గౌరవ అధ్యక్షుడిగా కార్పొరేటర్ అశోక్, అధ్యక్షుడిగా లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శిగా నర్సయ్య, కోశాధికారిగా అనిల్, సలహాదారులుగా సుధాకర్, మగ్దుం, ఉపాధ్యక్షులుగా సాంబయ్య, శంషొద్దీన్, సహాయ కార్యదర్శులుగా లక్ష్మీనారాయణ, వీరస్వామి, ప్రచార కార్యదర్శిగా విద్యాసాగర్, తోట రమేష్, వెంకటేశ్వర్లు, కార్యవర్గ సభ్యులుగా ప్రసాద్, శ్యామ్, మధు, శ్రీకాంత్, రాజన్న, రమేష్, మురళీధర్ ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి అనిల్ వివరించారు.

ఎలక్ట్రికల్ ఆటో షోరూం ప్రారంభం



మొంటోరో ఎలక్ట్రిక్ ఆటోను మార్కెట్‌లోకి విడుదల చేస్తున్న కంపెనీ ప్రతినిధులు

హన్మకొండ: హనుమకొండలో కీర్తి మోటార్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసి మొంటోరో ఎలక్ట్రికల్ ఆటో షోరూంను మొంటోరో కంపెనీ రీజినల్ హెడ్ (సేల్స్) సెయిజ్ ఎస్.కుమార్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలక్ట్రిక్ వాహనాలతో పర్యావరణానికి ఎలాంటి హాని కలుగదని చెప్పారు. ఈ ఆటో 10 కిలోవాట్స్ బ్యాటరీ ప్యాక్‌తో కూడుకున్నదని, ఒకసారి చార్జ్ చేస్తే 203 కిలోమీటర్ల వరకు ప్రయాణించవచ్చని వివరించారు. బ్యాటరీ పూర్తి చార్జ్ కావడానికి నాలుగు గంటల సమయం పడుతుందన్నారు. కీర్తి మోటార్స్ అధినేత కీర్తిరెడ్డి మాట్లాడుతూ ఎలక్ట్రిక్ ఆటోలతో అనేక ప్రయోజనాలు ఉన్నాయని చెప్పారు. ఎలక్ట్రిక్ ఆటో రీజినల్ హెడ్ (సర్వీస్) సిద్దం సందీప్, తెలంగాణ సేల్స్ హెడ్ శ్రావణ్‌రెడ్డి, హరీష్‌కుమార్, సత్యపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక పోటీలు

కాజీపేట రూరల్: రిపబ్లిక్‌డేను పురస్కరించుకొని రైల్వే జనరల్ ఇన్‌స్టిట్యూట్ కమిటీ ఆధ్వర్యంలో రైల్వే కార్మికులు, వారి పిల్లలకు కాజీపేట రైల్వే కమ్యూనిటీ హాల్‌లో పలు సాంస్కృతిక కార్యక్రమాల పోటీలను సోమవారం నిర్వహించారు. భరతనాట్యంలో 13మంది, వెస్ట్రన్ డ్యాన్స్‌లో 17మంది, జానపద నృత్యంలో 16మంది పాల్గొని ప్రతిభ కనబరిచారు. ఈ సందర్భంగా ఇన్‌స్టిట్యూట్ సెక్రటరీ దేవులపల్లి రాఘవేందర్ మాట్లాడుతూ విజేతలకు గణతంత్ర దినోత్సవం సందర్భంగా బహుమతులు ప్రదానం చేయనున్నట్లు వివరించారు. కాగా, కాజీపేట రైల్వే స్టేడియంలో రైల్వే ఇన్‌స్టిట్యూట్ కమిటీ ఆధ్వర్యంలో జరుగుతున్న క్రికెట్ టోర్నమెంట్ సోమవారం క్వార్టర్ ఫైనల్స్‌కు చేరింది. డీఎస్‌టీ పెహలత్ హేమంత్‌కుమార్, ఏరియా ఆఫీసర్ మునవర్ బాషా, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రాజీవ్ చౌదరి పాల్గొని టాస్‌వేసి క్రికెట్ జట్ల పోటీలను ప్రారంభించారు. జాయింట్ సెక్రటరీ ఎం.రాజయ్య, ట్రెజరర్ గిరిమిట్ల రాజేశ్వర్, సభ్యులు ప్రవీణ్, ప్రశాంత్, రవికిరణ్, రఘు, రైల్వే జేఏసీ చైర్మన్ కోండ్ర నర్సింగరావు, రైల్వే ఎస్సీ, ఎస్టీ ఆపరేటింగ్ సెక్రటరీ కేఎస్.రావు, ఎం.మహేష్, మిశ్రా, ముజాహిద్, మహేష్‌కుమార్, సునీల్, అనిల్ పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న రాఘవేందర్


పనుల్లో అవినీతిని సహించేది లేదు

హసన్‌పర్తి: వర్ధన్నపేట నియోజకవర్గంలో గతంలో చేపట్టిన పనుల్లో అవినీతి జరిగినట్లయితే సహించేది లేదని, విజిలెన్స్ విచారణకు ఆదేశిస్తానని ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు హెచ్చరించారు. స్థానిక ఎంపీపీ కేతపాక సునీత అధ్యక్షతన హసన్‌పర్తి మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొన్ని ప్రాంతాల్లో పనులు చేయకుండానే బిల్లులు తీసుకున్నారని అన్నారు. మరికొన్ని గ్రామాల్లో అభివృద్ధి పనుల్లో నాణ్యత పూర్తిగా కొరవడిందని విమర్శించారు. అందుకు బాధ్యులైన వారిని వదిలేదని స్పష్టం చేశారు. బిల్లులు రాలేదని సర్పంచ్‌లు ఎలాంటి ఆందోళనకు గురి కావొద్దని, రావాల్సిన బిల్లులన్నింటిని ఇప్పిస్తానని భరోసా ఇచ్చారు. ప్రభుత్వ పాఠశాలల్లోని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. పదవీ కాలం పూర్తవుతున్న సర్పంచ్‌లను ఎమ్మెల్యే సన్మానించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు రేణుకుంట్ల సునీత, వైస్ ఎంపీపీ రత్నాకర్‌రెడ్డి, తహసీల్దార్ చల్లా ప్రసాద్, ఎంపీడీఓ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాగరాజు

రైతు వ్యతిరేక ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలి



సమావేశంలో మాట్లాడుతున్న రమేష్

వరంగల్ చౌరస్తా: దేశీయ వ్యవసాయాన్ని కార్పొరేట్ శక్తులకు అప్పజెప్పేందుకు సకల ప్రయత్నాలు చేస్తున్న మతోన్మాద మోదీ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పడానికి అన్ని వర్గాల ప్రజలు ఏకం కావాలని సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కేఎం) రాష్ట్ర కన్వీనర్ పెద్దారపు రమేష్ పిలుపునిచ్చారు. జిల్లాలోని వివిధ రైతు వ్యవసాయ కార్మిక సంఘాల జిల్లా బాధ్యుల సమావేశం చిర్ర సూరి అధ్యక్షతన వరంగల్ అండర్ బ్రిడ్జికి సమీపంలోని ఓంకార్ భవన్‌లో సోమవారం జరిగింది. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ రైతు వ్యతిరేక విధానాలను తిప్పి కొట్టాలని సూచించారు. కనీస మద్దతు ధర చట్టం, రుణ విముక్తి చట్టం తీసుకురావాలన్నారు. ఈనెల 26న రిపబ్లిక్ డే సందర్భంగా దేశవ్యాప్తంగా 500 జిల్లాల్లో కిసాన్ వాహన ర్యాలీలు నిర్వహించనున్నట్లు వివరించారు. వరంగల్ జిల్లా కేంద్రంలో రైల్వే స్టేషన్ నుంచి చేపట్టనున్న కిసాన్ వాహన ర్యాలీలో రైతులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఫిబ్రవరి 16న గ్రామీణ బంద్‌కు పిలుపునిచ్చినట్లు పేర్కొన్నారు. సమావేశంలో వివిధ సంఘాల రాష్ట్ర జిల్లా బాధ్యులు గోనె కుమారస్వామి, రాచర్ల బాలరాజు, వీరగోని శంకరయ్య, బాబురావు, భూక్య సమ్మయ్య, ఓదెల రాజన్న, ఈర్ల పైడి పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

మల్లు రవికి శుభాకాంక్షలు

హసన్‌పర్తి: ప్రభుత్వ సలహాదారుడిగా నియమితులైన భట్టి మల్లు రవిని టీపీసీసీ ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండెల భద్రయ్య, తదితరులు సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు బొకే అందించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బొడ్డు అనిల్‌కుమార్, నరసింహారావు, శివ, అల్లం విజయ్, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.


టీజీఓ క్యాలెండర్ ఆవిష్కరణ

హన్మకొండ అర్బన్: తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ హనుమకొండ, వరంగల్ జిల్లాల శాఖల నూతన సంవత్సర క్యాలెండర్లను రాష్ట్ర పర్యావరణ, అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ తన స్వగృహంలో సోమవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో టీజీఓ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు ఎన్నమనేని జగన్‌మోహన్‌రావు, వరంగల్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మురళీధర్‌రెడ్డి, ఫణికుమార్, నాయకులు ప్రవీణ్‌కుమార్, కిరణ్‌కుమార్, రాజేష్‌కుమార్, సురేష్‌కుమార్, మాధవరెడ్డి, వెంకటేశ్వర్లు, అస్నాల శ్రీనివాస్, రాజేష్‌కుమార్, సుధీర్‌కుమార్, రామచంద్రరావు పాల్గొన్నారు.

ఆర్‌యూపీపీ క్యాలెండర్..

విద్యారణ్యపురి: ఆర్‌యూపీపీ రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను మంత్రి సురేఖ సోమవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో రాష్ట్రీయ పండిత పరిషత్ తెలంగాణ రాష్ట్ర సంఘం గౌరవ అధ్యక్షుడు కొండ యాదగిరి, హనుమకొండ, వరంగల్ జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పూర్ణచంద్ర ప్రసాద్, రవికుమార్, కక్కర్ల రమేష్, మురళీధర్, ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల బాధ్యులు జెట్టి సుభాష్, మహ్మద్ దిల్షాద్ తదితరులు పాల్గొన్నారు.

స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలి



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ గేట్ల వద్ద, అలాగే, జిల్లాలోని రోడ్ల పక్కన ఉన్న అన్ని విద్యాసంస్థల వద్ద స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయించాలని బహుజన స్టూడెంట్స్ ఫెడరేషన్ (బీఎస్ఎఫ్) కేయూ ఇన్‌చార్జ్ కళ్లెపల్లి ప్రశాంత్, కేయూ అధ్యక్షుడు శివకుమార్, ప్రధాన కార్యదర్శి నర్సింహులు కోరారు. ఈమేరకు జిల్లా అదనపు కలెక్టర్ రాధిక గుప్తకు సోమవారం వినతిపత్రం అందజేశారు. స్పీడ్‌బ్రేకర్లు లేకపోవటంతో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు.